
# సాక్షి గుంటూరు


బుధవారం ၊ 9 ၊ అక్టోబర్ ၊ 2024



### పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,523 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,221 క్యూసెక్కులు వదులుతున్నారు.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 588.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,040 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

### మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో ఆరో రోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

## న్యూస్‌రీల్

### నేటితో ముగియనున్న 'మద్యం షాపుల' దరఖాస్తు గడువు

నెహ్రూనగర్: ప్రైవేట్ మద్యం షాపుల నిర్వహణ కోసం ఈ నెల 1వ తేదీ నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. గుంటూరు జిల్లాలో 127 షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. మంగళవారం సాయంత్రానికి 2,118 దరఖాస్తులు అందాయి. పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 1,149 దరఖాస్తులు వచ్చాయి. 11వ తేదీన గుంటూరు జిల్లాకు సంబంధించి నగరంలోని విజ్ఞాన మందిరంలో, పల్నాడు జిల్లాకు సంబంధించి నరసరావుపేట టౌన్ హాల్‌లో ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీయనున్నారు. ఆ మేరకు షాపులు కేటాయించనున్నారు. 12వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి.

### కామన్‌వెల్త్ పోటీలకు సాదియా ఆల్మాస్



మంగళగిరి: ఈ నెల 8వ తేదీ నుంచి సౌతాఫ్రికా సన్ సిటీలో నిర్వహించనున్న కామన్‌వెల్త్ పోటీలకు మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని లు మంగళవారం తెలిపారు.

### 11 నుంచి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటించామని యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ శ్రీ దుర్గాష్టమి, శని, ఆదివారాలు సాధారణ సెలవులు అని చెప్పారు. ఆ రోజుల్లో యార్డులో క్రయవిక్రయాలు ఉండవని తెలిపారు. రైతులు మిర్చి బస్తాలు తీసుకురావద్దని సూచించారు. సోమవారం నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయని వివరించారు.

### సాయిబాబా పాదాలను తాకిన సూర్యకిరణాలు



పర్చూరు (చినగంజాం): మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో మంగళవారం ఓ ఘటన భక్తులను తరింపజేసింది. గ్రామంలోని వేంచేసియున్న షిర్డి సాయిబాబా మందిరంలో ఉదయం సూర్యకిరణాలు నేరుగా బాబా మూలవిరాట్ విగ్రహాన్ని పాదాల వద్ద తాకాయి. బాబా విగ్రహం చెంత అద్భుత ఘటనను చూసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం



బాపట్లటౌన్/కాకుమాను: రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలైన సంఘటన మండలంలోని జమ్ములపాలెం సమీపంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరు గ్రామానికి చెందిన 15 మంది మంగళవారం కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం సూర్యలంక సముద్రస్నానం చేసేందుకు బయల్దేరారు. మార్గంమధ్యలో రేటూరు-జమ్ములపాలెం మధ్యలో జిల్లెళ్లమూడి సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. వాహనంలో ప్రయాణిస్తున్న నాగేంద్రం, లక్ష్మీపార్వతి, అన్నపూర్ణ, నాగేశ్వరరావు, ఎం.లక్ష్మి, వి.రాఘవ, వి.వెంకటేశ్వరమ్మ, వి.తిరుపతిస్వామి, వి.పల్లవి, వి.సౌజన్య, ఎం.మనస్విని, ఎం.సుప్రియలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బాధితులను 108 వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎం.లక్ష్మి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. మిగిలిన క్షతగాత్రులంతా బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రూరల్ సీఐ గంగాధరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణమ్మకు హారతులు ఇస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ

# శ్రీపీఠే..సురపూజితే!

- శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు
- నేడు సరస్వతీదేవిగా అమ్మవారికి విశేష అలంకరణ
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు



డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు శక్తుల్లో ఒక శక్తి మహాలక్ష్మీదేవి. లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమిష్టి రూపమైన శ్రీమహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ మంగళవారం భక్తులను కరుణించారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించిన అనంతరం నిత్య పూజలు చేశారు. ఆలయ ఈఓ, పోలీసు, రెవెన్యూ అధికారులు తొలి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

**రూ.500 టికెట్లపై భక్తుల ఆగ్రహం**

రూ.500 టికెట్ల విక్రయంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.500 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు నుంచి నాలుగు గంటలకు పడితే రూ.300, రూ.100తో పాటు సర్వ దర్శనం గంటలోనే పూర్తవుతోందని తెలంగాణ నుంచి విచ్చేసిన భక్తులు పేర్కొన్నారు.

అమ్మవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల గురించి సీపీ రాజశేఖర్‌బాబును డీజీపీ అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. మంగళవారం దేవస్థానానికి రూ.57.18 లక్షల ఆదాయం లభించింది. రూ.500 టికెట్లతో రూ.24.13 లక్షలు, రూ.300 టికెట్లతో రూ.6.11లక్షలు, రూ.100 టికెట్లతో రూ.4.69 లక్షలు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.19.64 లక్షలు, ప్రత్యేక ఆర్జిత సేవా టికెట్ల ద్వారా రూ.1.10 లక్షలు, ఇతర సేవల ద్వారా రూ.1.51 లక్షల ఆదాయం లభించింది.

## కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కాణిపాకం ఆలయ అధికారులు, అర్చకులు

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం దేవస్థానం ఈఓ పట్టెం గురుప్రసాద్, అర్చకులు ఇంద్రకీలాద్రికి చేరుకోగా, దుర్గగుడి అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు, డీఈఓ రత్న రాజు, ఆలయ అర్చకులకు పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని అందజేశారు. దుర్గగుడి తరఫున ఈఓ రామరావు అమ్మవారి ప్రసాదాలను కాణిపాకం దేవస్థాన అధికారులకు అందజేశారు. అన్నవరంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి కూడా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అన్నవరం ఆలయ ఈఓ రామచంద్రమోహన్ దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి దుర్గగుడి అధికారులకు పట్టు వస్త్రాలు అందజేశారు.

## నేడు మూలా నక్షత్రం

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. అత్యంత కీలకమైన అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం దుర్గమ్మను శ్రీ సరస్వతీదేవిగా అలంకరిస్తారు. అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శించుకుని విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించాలని వేడుకునేందుకు అశేష భక్తజన కోటి మంగళవారం రాత్రి 11 గంటల నుంచే ఇంద్రకీలాద్రికి తరలివచ్చింది. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై రాత్రి నుంచి భక్తులను కంపార్టుమెంట్‌లోకి మళ్లించారు. బుధవారం తెల్లవారుజాము రెండు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైంది.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

# అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, వేదికపై ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తదితరులు

### మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకాంక్ష

గుంటూరు వెస్ట్: జిల్లా అభివృద్ధి ధ్యేయంగా అన్ని రంగాల్లో ముందుకు నడిపించేలా కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అందుకు అనుగుణంగా యువతకు ఉపాధి, రైతులకు ఆదాయం లభించేలా అధికారులు చూడాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర – 2047 కార్యక్రమంలో భాగంగా సలహాలు, సూచనలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు కుటుంబాలు నష్టాలతో పాటు ప్రకృతి వైపరీత్యాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఎక్కడున్నా అందరూ సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గించాలని తెలిపారు. జిల్లాలోని ప్రముఖ దేవాలయాలతోపాటు, పర్యాటక ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. యువతలో వృత్తి నైపుణ్యం పెంచాలని తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేసి క్రీడలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

**జిల్లాలో విస్తృత అవకాశాలు**

**ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి**

గుంటూరు జిల్లా అభివృద్ధికి అనేక మార్గాలు ఉన్నాయన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు సంబంధించి రూపొందించిన డిస్ట్రిక్ విజన్ ప్లాన్ బాగుందని, అయితే దీనిని అందరూ కలిసి చిత్తశుద్ధితో అమలు పరిచేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా విజన్‌లో చూపిన 22 శాఖలకు సంబంధించిన అంశాలపై అభివృద్ధి సూచికలు బాగున్నాయన్నారు. విద్యతోపాటు ఇతర రంగాలపై కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర –2047 పై 58 వేల మంది అభిప్రాయాలు పంచుకున్నారని పేర్కొన్నారు. అధికారులు మండల స్థాయిలో ప్లాన్ తయారు చేసి సమర్పించాలన్నారు. ఆ ఇన్‌పుట్స్ ఆధారంగా జిల్లాకు ప్రణాళిక సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అర్బన్ ప్రాంతం ఎక్కువని, అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా ఉపాధి మార్గాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో చాలా మండలాల్లో మంచి ప్రగతి సాధించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, శాసన సభ్యులు మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పాల్గొన్నారు.

### వేదికపైనే ఎమ్మెల్సీ అసహనం

గుంటూరు వెస్ట్: నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై గళమెత్తే శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు ఆగ్రహించారు. మంగళవారం స్వర్ణాంధ్ర 2047పై సలహాలు, సూచనల సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో సోమవారం నిర్వహించిన ఏపీ సాగుదారుల హక్కుల చట్టం -2024 పై చర్చకు తనను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌలు రైతులపై తనలా ఎవరూ మాట్లాడలేదని, డీఆర్సీ సమావేశంలో నమోదైన మినిట్స్ బుక్స్ తీసి చూడాలన్నారు. కనీస ప్రొటోకాల్ పాటించరా? అని నిలదీశారు. ఏం చెప్పాలో అధికారులకు అర్థం కాలేదు. ఎంపీ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి సర్ది చెప్పడంతో లక్ష్మణరావు శాంతించారు. వాస్తవానికి ఆయన కోపంలో అర్థముంది. ముఖ్యంగా కౌలుదారుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ఎవ్వరూ చేయలేదు. జిల్లా సమీక్షా సమావేశాల్లో ఎన్నోసార్లు ఆయన కౌలు రైతుల కోసం బ్యాంకర్లపై విరుచుకుపడిన సందర్భాలున్నాయి. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావుతో పాటు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నంలకు ఆహ్వానం అందలేదు. మరోవైపు ఏపీ సాగుదారుల హక్కుల చట్టం-2024 చర్చకు సొంత పార్టీ శాసనసభ్యులే డుమ్మా కొట్టారు. ఆదర్శ రాజకీయాలు చేయాలనే టీడీపీ ముందు వాటిని ఆ పార్టీ అలవరచుకోవాలని కొందరు సూచిస్తున్నారు.

### ధనలక్ష్మి



నకరికల్లు మండలం నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారిని మంగళవారం రూ.మూడు కోట్ల కరెన్సీ నోట్లతో ఆకట్టుకునేలా అలంకరించారు. అర్చకులు పి.శ్రీనివాసరావు అమ్మవారికి పూజలు నిర్వహించారు. – నకరికల్లు

# రారెత్తేలా.. టమాటా..!

'గుండెలెందుకు బాదుకోడం
కూర ధర పెరిగిందని,
పేద ప్రాణం రేటు మినహా
దేని ధర తరిగిందని' ఓ రచయిత ఆవేదన..

- అదుపు లేకుండా పెరుగుతున్న ధర
- రైతుబజార్లలో కిలో దాదాపు రూ.68
- బహిరంగ మార్కెట్‌లో రూ.80పైనే
- రాయితీపై విక్రయించాలని ప్రజల విజ్ఞప్తి



పట్టాభిపురం రైతు బజారులో టమాటాలు విక్రయిస్తున్న దృశ్యం

కొరిటెపాడు(గుంటూరు): నిత్యావసరాల ధరలు పగలే చుక్కలు చూపిస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటే సగటు జీవి భయపడుతున్నాడు. వరదల పేరుతో ధరలకు రెక్కలొచ్చాయి. అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న ధరలతో పేదలు, చిరుద్యోగులకు పచ్చడి మెతుకులే దిక్కు అవుతున్నాయి. మహిళ వంటలో టమాటా లేకుండా పూట గడవదు. తెలుగింట ప్రతి ఇంటా సాధారణంగా వినియోగించడం ఆనవాయితీ. కానీ రోజురోజుకు టమాటా ధరలు పెరుగుతూ భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం రైతుబజార్లలో కిలో ధర రూ.68కు చేరుకుంది. వారం కిందట కిలో ధర రూ.44 ఉండగా.. ఇప్పుడు కిలోకి ఏకంగా రూ.24 పెరిగి దడ పుట్టిస్తోంది. ఇదే ధరలు కొనసాగితే టమాటాకు టాటా చెప్పాల్సిన పరిస్థితి.

**నగరంలో డిమాండ్ ఇలా..**

గుంటూరు నగరంలో మూడు రైతుబజార్లు ఉన్నాయి. రోజుకు ఎనిమిది టన్నుల టమాటా అవసరం ఉంది. అయితే ప్రస్తుతం సగటున ఐదు టన్నులు మాత్రమే వస్తోంది. పట్టాభిపురం, ఆర్‌టీసీ బస్టాండ్ రైతుబజార్లలో అధికంగా టమాటా విక్రయాలు సాగుతున్నాయి. చుట్టుగుంట రైతుబజారులో తక్కువ టమాటాలు విక్రయాలు జరుగుతున్నాయి.

**జిల్లాలో సాగు ప్రాంతాలు..**

గుంటూరు జిల్లాలో చేబ్రోలు, పొన్నూరు, తెనాలి, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ తదితర మండలాల్లో టమాటా పంట సాగవుతోంది. స్థానిక పంట డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తుందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మదనపల్లి, గుర్రపుకొండ, పలమనేరు, బెంగళూరు, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి గుంటూరుకు టమాటా దిగుమతి అవుతోంది. ఆగస్టు చివరిలో కురిసిన భారీ వర్షాలకు టమాటా పంట కొంత వరకు పాడవడం, రవాణా చార్జీల కారణంగా ధరలు పెరుగుతున్నాయని వారు చెబుతున్నారు.


**4 నెలలుగా టమాట ధర (రూ.లలో)**

| జులై | ఆగస్టు | సెప్టెంబర్ | అక్టోబర్ |
|---|---|---|---|
| 34 | 28 | 35 | 68 |

### నియంత్రణ కొరవడి..

ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వల్లే ధరలు పెరుగుతున్నాయి. గతంలో సెంచరీ దాటిన టమాటా.. ఇప్పుడు మళ్లీ ఆ దిశగా పయనిస్తుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ధర ఎక్కువగా ఉన్న కారణంగా వినియోగదారులు కిలో బదులు అర కిలో లేదా పావు కిలో కొనుగోలు చేస్తున్నారు. ఇక బహిరంగ మార్కెట్‌లు, తోపుడు బండ్ల వద్ద కిలో టమాటా రూ.80 నుంచి రూ.90 వంతున విక్రయిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ రోజూ వంటల్లో టమాటాను తప్పనిసరిగా వాడతారు. అందుకే టమాటాకు అంత డిమాండ్. హోటళ్లు, పార్లర్లు, రెస్టారెంట్లు వారు కూడా టమాటా కోసం రైతుబజార్లకు వస్తుంటారు. వీరు రోజూ 10 నుంచి 20 కిలోల వరకూ కొనుగోలు చేస్తారు.


### రాయితీపై విక్రయించాలి..



రైతుబజార్లలో టమాటా ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో ధర రూ.68గా ఉంది. బహిరంగ మార్కెట్‌లో రూ.90 పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాయితీ ధరకు విక్రయించేలా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలి.

–నుసుం భాగ్యలక్ష్మి, లక్ష్మీపురం, గుంటూరు

### కొనలేకపోతున్నాం..



గతంలో వారానికి రెండు కిలోల టమాటా కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం ధరలు చూసి అర కిలో లేదా పావు కిలోతో సరిపెట్టుకుంటున్నాం. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం స్పందించి టమాటా ధరలు నియంత్రించాలి. రాయితీపై టమాటాలు విక్రయించాలి.

–ఎం.జయభారత్‌రెడ్డి, కొరిటెపాడు, గుంటూరు

# 13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్



టీషర్టులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మంగళగిరి: జాతీయ తపాలా వారోత్సవాలను పురస్కరించుకుని ఏపీ సర్కిల్ తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన గుంటూరులో ఇండియా పోస్ట్ రన్ 2024ను నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ పోస్టు మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి తెలిపారు. ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ఈ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం మండలం నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆవరణలో రన్‌కు సంబంధించిన పోస్టర్‌లను, టీషర్ట్‌లను ఆవిష్కరించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇంజినీర్ ఇన్ చీఫ్ నయిముల్లా, గుంటూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ యల్లమందయ్య తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డుకు మంగళ, బుధ, గురువారాలు పండుగ సందర్భంగా సెలవు. కావున మార్కెట్ యార్డులో పాట జరగలేదు.

క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ ప్రముఖులను కలిసిన నగర అధ్యక్షుడు



ఎంపీ అయోధ్య రామిరెడ్డిని సత్కరిస్తున్న డైమండ్ బాబు, పక్కన మోదుగుల

పట్నంబజారు: రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల వైఎస్సార్ కాంగ్రెస్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డిలను పార్టీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెడ్డిపాలెంలోని వారి స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించారు. అనంతరం డైమండ్ బాబును కూడా ఎంపీ ఆళ్ల , మోదుగుల సన్మానించారు.

### జిల్లాలో ఎనిమిది మంది ఎస్‌ఐలు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో ఎనిమిది మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలు టి.వెంకట్రావును డీసీఆర్‌బీ, సీహెచ్ రాజ్యలక్ష్మిని తెనాలి పీఎస్ఆర్‌కు, కె.రంగరావును అరండల్‌పేట పీఎస్‌కు, టి.భవానీని మహిళా పీఎస్‌కు, ఎస్.కోటయ్యను తాడేపల్లి పీఎస్‌కు, ఎస్సీ ప్రసాద్‌ను తుళ్ళూరు ట్రాఫిక్ పీఎస్‌కు, పట్టాభిపురం పీఎస్ ఎస్ఐ ఎ.మధు పవన్‌ను పెదనందిపాడు పీఎస్‌కు, పెదనందిపాడు పీఎస్ ఎస్ఐ ఎన్.నరహరిని పట్టాభిపురం పీఎస్‌కు బదిలీ చేశారు.

### తల్లి మృతిని జీర్ణించుకోలేక యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: తల్లి మృతి చెందడంతో ఆ బాధతో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రాయిల్‌పేటలో నివాసం ఉండే మొహమాటం లక్ష్మి (53)కి వెంకటపవన్ (34), మనోజ్‌కుమార్ సంతానం. లక్ష్మి మంగళవారం ఉదయం అనారోగ్య కారణాలతో మృతి చెందింది. దీన్ని జీర్ణించుకోలేని పవన్ ఆమె వినియోగించే మందు బిళ్లలను మింగాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మనోజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కార్యకర్తలను కాపాడేలా జిల్లా కమిటీ నిర్మాణం

- తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేతలతో జిల్లా అధ్యక్షుడు అంబటి
- మద్యం దుకాణాల విషయంలో వసూళ్లకు కూటమి తెరతీసిందని ఆరోపణ
- అబద్ధాలను అందంగా చెప్పి చంద్రబాబు మోసగించారని మోదుగుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు. వేదికపై మోదుగుల, అన్నాబత్తుని తదితరులు

పట్నంబజారు: ప్రతి కార్యకర్తకు అడుగులో అడుగై అన్నివేళలా కాపాడుకునేలా బలమైన జిల్లా కమిటీ ఏర్పాటు చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం తెనాలి నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వారి మనోభావాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రోజురోజుకీ దిగజారిపోతోందన్నారు. రాష్ట్రంలో సిండికేట్ వ్యవస్థ కొనసాగుతోందని మండిపడ్డారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో 21 మద్యం షాపులకు సంబంధించి ఒక్కొక్క దుకాణం నుంచి రూ.30 లక్షల చొప్పున కూటమి నేతలు భయపెట్టి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నిజాలు నిర్భయంగా చెప్పలేని చంద్రబాబు, అబద్ధాలను అందంగా చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. భూకంపం వచ్చినా బెదరని కార్యకర్తలు వైఎస్సార్ సీపీకి ఉన్నారని, వారిలో ఉన్న ధైర్యానికి కాస్తంత మనోధైర్యాన్ని కల్పిస్తే పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు. స్థానిక సంస్థల్లో సైతం గెలిచి దమ్ము చాటాల్సిన అవసరం ఉందన్నారు. తెనాలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ.. తాను నియోజవకర్గంలోని ఏటీఎంగా ఉన్నానని అభివర్ణించారు. అంటే.. ఎనీ టైం ఎమ్మెల్యేలా ప్రతి ఒక్కరి కోసం అహర్నిశలు శ్రమించానన్నారు. ఏ విధానాల వల్ల తప్పులు దొర్లాయనే అంశంపై అందరం పునరాలోచించుకుని పూర్తి స్థాయిలో పార్టీ కమిటీ నిర్మాణానికి సిద్ధం కావాలన్నారు. క్యాడర్ కొంత మేరకు ఇబ్బంది పడినా.. ప్రజలకు మాత్రం అన్ని విధాలుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందజేశారని గుర్తుచేశారు. తెనాలి నియోజకవర్గంలో రూ. 1,900 కోట్లతో సంక్షేమం అమలు, అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో తెనాలి జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, కొల్లిపర మండల ఎంపీపీ భీమవరపు పద్మావతి, జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నేతలు తాడిపోయిన రమేష్, అవుతురెడ్డి, మొహమ్మద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# నాటకరంగ దార్శనికుడు ఏఆర్ కృష్ణ

ఏఆర్ కృష్ణ అవార్డు గ్రహీత డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి



డాక్టర్ డీఎస్ఎన్ మూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి: నాటకరంగ దార్శనికుడు పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ అని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, అధ్యాపకుడు, విశ్లేషకుడు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అన్నారు. తెలుగు నాటక రంగంలో ప్రారంభించినవన్నీ కొనసాగితే ఇప్పుడు తెలుగు నాటకం జాతీయస్థాయిలో అగ్రగామిగా ఉండేదని అభిప్రాయపడ్డారు. కళల కాణాచి-తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్త నిర్వహణలో చతుర్థ జాతీయస్థాయి పద్యనాటక, సాంఘిక నాటక / నాటికల పోటీలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద గంగోత్రి వ్యవస్థాపకుడు జీవీఎస్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని డాక్టర్ డీఎస్ఎన్ మూర్తికి ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ మూర్తి మాట్లాడుతూ.. భారత ప్రతినిధిగా ఏఆర్ కృష్ణ చైనా, దక్షిణాఫ్రికా మినహా ప్రపంచమంతా పర్యటించినట్టు చెప్పారు. ప్రతి నాటక సమాజం చేతిలో అయిదారు నాటకాలు ఉండాలని, ఏదైనా ఊరిలో వరసగా పదిరోజులు వాటిని ప్రదర్శించాలని చెప్పారు. నాటకంలోని అన్ని శాఖలలో 'ప్రొఫెషనల్ పెర్ఫార్మెన్స్' ఉంటేనే థియేటర్ అవుతుందని, లేకుంటే కేవలం డ్రామాగానే మిగిలిపోతుందని ఏఆర్ కృష్ణ చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. అజోవిభోకందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ.. డీఎస్ఎన్ మూర్తితో తన అనుబంధాన్ని వివరించారు. మూర్తికి నాటకమే జీవితమన్నారు. నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడుతూ.. తెలుగు నాటకరంగం డాక్టర్ మూర్తికి రుణపడి ఉందన్నారు. 1885లో కందుకూరి 'వ్యవహార ధర్మప్రబోధిని' మొదలు అప్పటి వరకు వచ్చిన 'రుద్రవీణ' వరకు ఎప్పటికప్పటి ఆహార్యం, రంగాలంకరణతో 3.10 గంటలసేపు ప్రదర్శించి అపూర్వ ప్రయోగం చేశారని చెప్పారు. సభాధ్యక్షుడు వరప్రసాద్ మాట్లాడుతూ.. సంగీత, నాటక అకాడమీల పునరుద్ధరణకు కృషి చేస్తామని చెప్పారు. కళలకాణాచి వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి మాధవ్ బుర్రా ప్రసంగిస్తూ.. ఏఆర్ కృష్ణ, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి పేరిట జాతీయ రంగస్థల పురస్కారాలను ప్రదానం చేయటం తమ అదృష్టమన్నారు. ఉత్సవాల్లో ప్రదర్శిస్తున్న నాటకాల సంపుటి 'విపంచి', ఏఐఆర్ విశ్రాంత డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు రచన 'రంగవీక్షణం' పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో మొదలైన సభ ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ వందన సమర్పణతో ముగిసింది.

# రోగుల వద్ద ఎక్కువగా నేర్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్నమెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ టీటీకే రెడ్డి

నగరంపాలెం: ఆస్పత్రి వార్డుల్లోని రోగులను చూసి ఎక్కువ నేర్చుకోవాలని గుంటూరు మెడికల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. జింకానా ఆడిటోరియంలో మంగళవారం కళాశాల దినోత్సవ వేడుకలు(ఫ్లక్సస్ 2024) నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బట్టీపట్టి చదవడం, ఇంటర్‌నెట్‌ల వద్ద ఎక్కువ సమయం గడపవద్దని అన్నారు. ఆస్పత్రిల్లోని రోగుల ద్వారా అనేక విషయాలు తెలుస్తాయని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ టీటీకే రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.ప్రభాకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎ.కిరణ్ కుమార్, జింకానా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బాలభాస్కర్, కోఆర్డినేటర్ పీవీ హనుమంతు, నాట్కో సీఈఓ వై.అశోక్‌కుమార్, మానసిక వ్యాధుల విభాగాధిపతి ఉమాజ్యోతి పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న అంతరిక్ష వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నారు. సైన్స్ ఫెయిర్, క్విజ్, డ్రాయింగ్ పోటీలు, వీడియో ప్రోగ్రామ్‌ల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాలలోని ఎస్‌ఈసీ, ఈసీఈ బ్లాక్‌ల్లో ఏర్పాటుచేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం విగ్రహాన్ని షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహదుర్తై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం స్వస్థలమైన రామేశ్వరానికి చెందిన తాను, తన చేతుల మీదగా విగ్రహావిష్కరణ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గెస్ట్‌లెక్చర్‌లో పాల్గొన్నారు. చంద్రయాన్-1,2,3లో ఇస్రో బృందం ఎదుర్కొన్న సమస్యలను తెలియజేశారు. వాతావరణ పరిస్థితులు, వాటి పరిష్కారాలను వారు ఎలా అధికమించారో వివరించారు.

### యువకులపై పోక్సో కేసు

చెరుకుపల్లి: బాలికను వేధించడంతోపాటు ఆమె తండ్రిని గాయపరిచిన ఇద్దరిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి కనగాల గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో రాజవోలు గ్రామానికి చెందిన కుంచల భార్గవ్‌రెడ్డి వేధించాడు. ఈ క్రమంలో తన అనుచరుడైన దొంతిబోయిన విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటికి వెళ్లాడు. బాలిక కుటుంబసభ్యులపై కత్తి, ఇనుప సుత్తితో దాడి చేశాడు. దీంతో బాధితురాలి తండ్రి గాయపడ్డాడు.

# గల్లంతైన వ్యక్తిని కాపాడిన పోలీసులు



బాపట్ల టౌన్: అలల ఉధృతికి వ్యక్తి గల్లంతవడంతో వెంటనే పోలీసలు, ఈతగాళ్లు స్పందించి కాపాడారు. ఈ ఘటన మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన దయాకర్ మహేష్ కుటుంబ సభ్యులతో మంగళవారం సూర్యలంక సముద్ర తీరానికి వచ్చారు. అందరూ స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా ఎగిసి పడిన అలల తీవ్రతకు ఆయన సముద్రంలో కొట్టుకుపోయారు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు సముద్రంలోకి వెళ్లి మహేష్‌ను కాపాడి తీరానికి తీసుకొచ్చారు. తక్షణమే స్పందించి ప్రాణాలు కాపాడిన వారిని స్థానికులు అభినందించారు. మహేష్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మార్కెట్‌లోకి నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ నూతన ఉత్పాదనలు



గ్లాంజ్ మందును ఆవిష్కరిస్తున్న నాట్కో కంపెనీ ప్రతినిధులు

కొరిటెపాడు(గుంటూరు): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన నూతన ఉత్పాదనలను మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. 'గ్లాంజ్', 'బోస్‌నెట్' శిలీంద్ర నాశినులు (తెగుళ్ల మందులు), నాట్‌నెక్ట్స్ కీటకనాశిని (పురుగుల మందు)లను స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ చెబియం మాట్లాడుతూ.. తమ విస్తృత శ్రేణి ఉత్పత్తుల్లో ఒకటైన గ్లాంజ్‌ను వివిధ పంటలలో సమర్థంగా వ్యాధి నియంత్రణకు రూపొందించామని తెలిపారు. పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన పద్ధతులను ప్రోత్సహిస్తూ ఉత్పాదకతను పెంపొందించాలనే తపనతో తాము వీటిని తెచ్చామని వివరించారు. రైతులను ఆదుకోవడమే తమ లక్ష్యం అని చెప్పారు. జాతీయ సేల్స్, మార్కెటింగ్ హెడ్ సార నర్సయ్య మాట్లాడుతూ.. గ్లాంజ్ మందు వరిలో మానిపండు, కాటుక, గోధుమ రంగు మచ్చ తెగుళ్ల నివారణకు ఉపయోగపడుతుందన్నారు. టమాటాలో ఆకుమాడు, మినుములో సెర్కోస్పోరా మచ్చ, మిరపలో బూడిద, ఆల్టనేరియా ఆకుమచ్చ, పక్షికన్ను, పత్తిలో ఆల్టనేరియా ఆకుమచ్చ తెగుళ్లను నివారిస్తుందని వివరించారు. బోస్‌నెట్ కూడా వివిధ పంటలలో బూడిద, మచ్చల తెగుళ్లను నివారిస్తుందన్నారు. నాట్‌నెక్ట్స్ వివిధ పంటలలో కాయతొలుచు పురుగు, నల్లి (కింద ముడత) నివారణను ఉపకరిస్తుందని వివరించారు.

కార్యక్రమంలో కంపెనీ జడ్ఎం సౌత్ సేల్స్ అండ్ మార్కెటింగ్ రామిశెట్టి మాలకొండయ్య, ఏపీ సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగ ప్రతినిధి గోపు అజయ్‌రెడ్డి, ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన నాట్కో డిస్ట్రిబ్యూటర్లు, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: బీ ఫార్మసీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ సీఐ ఎం.వీరయ్య ఈ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. వారి కథనం మేరకు.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఓ విద్యార్థిని గుంటూరు సమీపంలోని ఓ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతున్నారు. ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున స్నేహితుడితో అతడి ద్విచక్ర వాహనంపై ఆర్టీసీ బస్టాండ్ వద్దకు కాఫీ తాగేందుకు వెళ్లారు. తిరిగి తన రూము వద్దకు అతడు తీసుకెళుతున్న సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి నంబరు ప్లేట్ లేని బైకుపై వచ్చి పోలీసునంటూ భయపెట్టాడు. అనంతరం ఆ యువతిని ఎక్కించుకుని ఆమె స్నేహితుడిని తన వెనుక రావాలని పేర్కొన్నాడు. బస్టాండ్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలతోపాటు లాలాపేట పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లాడు. తాను చెప్పినట్లు వినకపోతే స్టేషన్ లోపలికి తీసుకెళతానని భయపెట్టాడు. వారు భయపడటంతో రూము వద్దకు తీసుకెళ్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో కొత్తపేట వద్ద స్నేహితుడి బైక్‌లో ఇంధనం అయిపోయింది. విద్యార్థినిని ఆ దుండగుడు బుచ్చయ్యతోటలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రెండు అంతస్తుల బిల్డింగ్ వరండాలోకి తీసుకెళ్లి కొట్టి బెదిరించాడు. ఆపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత ఆమెను రూము వద్ద వదిలి వెళ్లిపోయాడు. దీనిపై స్నేహితుడి సాయంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన పోతినేని గోపి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మంగళవారం న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పలు చోరీ కేసుల్లో అతడు ఇప్పటికే నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి, ఓ ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఎస్ఐ డి.రమేష్, ఏఎస్ఐ ఆంథోని, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, బిక్షం, కోటేశ్వరరావు, పోతురాజు, హోంగార్డు షరీఫ్‌లను డీఎస్పీ అజీజ్ అభినందించారు.

# హోంగార్డులు అభినందనీయులు

- మృతి చెందిన ఇరువురి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కులు పంపిణీ
- ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి రూ.5 లక్షల చెక్కు
- జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



మృతిచెందిన హోంగార్డు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: అనారోగ్యంతో మృతిచెందిన, బాధపడుతున్న సహోద్యోగుల కుటుంబాలకు సహాయం చేసేందుకు తమ ఒక్కరోజు వేతనాన్ని అందించిన హోంగార్డులు అభినందనీయులని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కొంతకాలంగా పూజారిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు శివ కామేశ్వరరావుకి రూ.5లక్షలు, నరసరావుపేట ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు మల్లికార్జునరావు కుటుంబ సభ్యులకు మరో రూ.5లక్షల చెక్కు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్పీ శ్రీనివాసరావుకు రూ.5లక్షల చెక్కు అందజేశారు. వారి జీవితం నిండునూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

### సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

నగరంపాలెం: మహిళపై గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి ఇరవై ఏళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.66 వేల వంతున జరిమానా, బంగారం కొనుగోలు చేసిన వ్యక్తికి మూడేళ్ల శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 సెప్టెంబర్ 8న రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన దంపతులు మేడికొండూరు పీఎస్ పరిధిలో ఓ కార్యక్రమానికి వెళ్లి బైకుపై ఇంటికెళ్తున్నారు. పాలడుగు మీదుగా వెళ్తుండగా రహదారికి అడ్డుగా దుండగులు పెద్ద కర్ర వేశారు. దీంతో ఇద్దరూ ఆగారు. ఈలోగా చెట్టు చాటున దాగి ఉన్న నలుగురు హఠాత్తుగా వచ్చారు. మరణాయుధాలు చూపి, భర్తపై దాడికి పాల్పడ్డారు. బనియన్, డ్రాయర్‌పై ఉంచి కాళ్లు, చేతులు కట్టేశారు. ఆమెను సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆమె నుంచి బంగారు, వెండి నగలు, కొంత నగదు లాక్కుని పరారయ్యారు. బాధితురాలు మేడికొండూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ కె.మారుతీకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు. కర్నూలు జిల్లా నంద్యాల టౌన్‌కు చెందిన ఆకుల లింగయ్య, గడివేముల మండలం అంబావరం గ్రామ వాసి దాసరి ఓబులేస్‌లను అరెస్ట్ చేశారు. నిందితుడైన ఓ మైనర్‌ను జువైనల్ కోర్టుకు పంపించారు. ప్రస్తుతం ఒకరు పరారీలో ఉన్నారు. ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో లింగయ్య, ఓబులేస్‌లకు ఇరవై ఏళ్ల చొప్పున కఠిన కారాగార జైలు శిక్ష, రూ.66 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. వారి నుంచి బంగారం కొనుగోలు చేసిన కర్నూలు జిల్లా నంద్యాల టౌన్ వాసి రమణకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఏపీపీ పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించగా, అప్పటి సీఐ కె.మారుతీకృష్ణ కేసు దర్యాప్తు చేశారు.

# ఘనంగా అభిషేక మహోత్సవం




వాక్యోపదేశం చేస్తున్న రెవరెండ్ డాక్టర్ చిన్నబత్తిన భాగ్యయ్య

నెహ్రూనగర్: గుంటూరు మేత్రాసన పీఠాధిపతిగా బిషప్ రెవరెండ్ డాక్టర్ చిన్న బత్తిన భాగ్యయ్య 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంపాలెంలోని పునీత అంథోని పుణ్యక్షేత్రంలో నూతన గురు నిలయాన్ని మంగళవారం ప్రారంభించారు. భాగ్యయ్య మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రంలో ఏసుక్రీస్తు అద్భుత కార్యాలు చేశారని చెప్పారు. ఏసుక్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని చెప్పారు. పుణ్యక్షేత్ర విద్యుత్తు దీపాలంకరణకు సంఘ కమిటీ సభ్యుడు నేలపాటి జ్ఞాన ప్రకాశరావు రూ. లక్ష విరాళం అందజేశారు. ముందుగా భాగ్యయ్యకు అభిషేక మహోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర విచారణ గురువు ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు, విజయవాడ మేత్రాసన పీఠాధిపతి రాజారావు, విచారణ గురువులు అంథోని బాల, మద్దు బాల, డాక్టర్ దాసరి కిరణ్, మఠ కన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.